క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జునరెడ్డి



అవుకు: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జున రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు తహసీల్దార్‌గా ఉన్న సువర్ణాదేవి నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో అవుకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డికి పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ అధ్యక్షుడు

బనగానపల్లె రూరల్: దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలతో పాటు ఉద్యోగ నియామకాల్లో వయోపరిమితి పెంచాలని నంద్యాల జిల్లా దివ్యాంగ జేఏసీ అధ్యక్షుడు అదనం దేవరాజు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ నియామకాల్లో 50 ఏళ్ల వరకు వయోపరిమితి పెంచాలన్నారు. అలాగే 18 నుంచి 45 ఏళ్ల దివ్యాంగులే త్రీ వీలర్ స్కూటీలకు అర్హులని పేర్కొనడం సరికాదన్నారు. మానవతా దృక్పథంతో అర్హులందరికీ అందజేయాలని కోరారు. దివ్యాంగులు మద్దిలేటి, సుబ్బరాయుడు, యోగి, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవం



ముస్తాబైన కాశిరెడ్డి నాయన ఆశ్రమం

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ క్రాస్ వద్దనున్న కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో శుక్రవారం 29వ ఆరాధన మహోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆశ్రమాన్ని విద్యుత్ బల్బులతో సుందరంగా అలంకరించారు. ఎద్దుల రాతిదూలం పోటీలు, గార్దబాల పోటీలు నిర్వహించనున్నారు. ఆశ్రమం ప్రాంగణంలో వెలసిన ఆలయాల్లో కులశస్థాపన, సకల దేవతల హోమం, పూర్ణాహుతి, అభిషేకాలు తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. పోచా శీలారెడ్డి, పోచా శంకర్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, పోచా వెంకట రామిరెడ్డి పర్యవేక్షణలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, చింతామని నాటకం, చెక్కభజనలు, సాంస్కృక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

డోన్ టౌన్: జడ్చర్ల సమీపంలోని బాల్‌నగర్ వద్ద ఈ నెల 4వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ (35) కుటుంబ సభ్యులకు లారీ కార్మికులు, లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. గురువారం మృతుని స్వగ్రామమైన యర్రగుంట్ల గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. లారీ డ్రైవర్లు, క్లీనర్లు రూ.21వేలు, లారీ యజమాని రూ.15వేలు చొప్పున అందజేశారు. సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్, మద్దిలేటి, మోహన్‌రావు, రమయణ్య తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దయ్య

కోవెలకుంట్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని జైభీమ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య అన్నారు. కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోలో జైభీమ్ అసోసియేషన్ ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకోవడంతో శుక్రవారం అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. డిపో ఉద్యోగులు, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు కలిసికట్టుగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఆర్టీసీ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే అసోయేషన్ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, సుబ్బరాయుడు, చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆశలు ఆవిరి

- ముంచిన ఫెంగల్ తుపాన్
- తడిసిన ధాన్యం
- పంటలకు తీవ్ర నష్టం
- కన్నీరు మున్నీరవుతున్న వరి రైతు



కోవెలకుంట్ల సమీపంలో తడిసిన వడ్లను ఆరబోస్తున్న రైతు



వర్షం కారణంగా గుళ్లదూర్తి సమీపంలో నేలవాలిన వరి



ముక్కమల్లలో ధాన్యం తడవకుండా కప్పిన పట్టలు



అబ్బులాపురంలో నేలకొరిగిన వరి పంట



అవుకు: వరి ధాన్యానికి పట్టలు కప్పతున్న రైతులు



గిద్దలూరు గ్రామంలో నెలవాలిన వరిపంట

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వివిధ పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సబ్ డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా 18.8 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 8.6 మి.మీ, సంజామల మండలంలో 7.4 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 4.6 మి.మీ, దొర్నిపాడు మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వరి, పత్తి, కంది పంటలకు నష్టం చేకూరుస్తుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన వరి వర్షం కారణంగా నేలవాలి వడ్లు రాలిపోవడం, కోత, నూర్పిడి చేసి కల్లాలు, పొలాల్లో ఆరబోసిన వడ్లు తడిసిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పంట చేతికందే సమయంలో వర్షం తమను నిలువునా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, కంది పంటల్లో పూత, పిందె రాలిపోయి నష్టం వాటిల్లుతున్నట్లు వాపోతున్నారు.

వీడని వర్షం

కొలిమిగుండ్ల: తుపాన్ ప్రభావంతో నాలుగు రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. గురువారం మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా మారిపోయి మబ్బులు కమ్ముకున్నాయి. అబ్బులాపురం, కోర్నపల్లె, తిమ్మనాయినపేట తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. వర్షం వల్ల పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగాకు తడిసిపోకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పుకున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు రబీలో సాగు చేసిన శనగకు వర్షాల వల్ల ఊరటనిస్తుంది.

వదలని వాన.. రైతుల ఆందోళన

సంజామల: మండలంలో మూడురోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంజామల మండల వ్యాప్తంగా 7.4 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి ప్రస్తుతం కోత దశలో ఉంది. వర్షానికి చాలా వరకు పంట నెల కొరిగింది. మండల వ్యాప్తంగా 3 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో 200 ఎకరాలు వరికోత పూర్తి చేసుకుని కల్లాల్లో ఉన్నాయి. తుపాన్ ప్రభావంతో వెయ్యి ఎకరాల్లో వరి నేలవాలిందని వ్యవసాయ అధికారుల అంచన వేస్తున్నారు. ఇలాగా వర్షాలు కొనసాగితే తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు తప్పని తిప్పలు

అవుకు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పంటను, దిగుబడులను రక్షించుకునేందుకు ముప్పుతిప్పలు పడుతున్నారు. ధాన్యానికి పట్టలు కప్పి రక్షించుకుంటున్నారు. మండల పరిధిలో వరికోతలు 40 శాతం పూర్తయ్యాయి. కోతలు కోస్తున్న సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంట దిగుబడి రక్షణలో నిమగ్నమయ్యారు. కోతలు కోసిన వరి ధాన్యాన్ని కొందరు రోడ్లపై, కల్లాల్లో ఆరబోసుకున్నారు. మరికొందరు రైస్‌మిల్లులకు తరలించారు. అలాగే కోత దశలో ఉన్న వరి వర్షాలకు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వ్యవసాయ అధికారులు రైతులెవరూ కోతలు కోయవద్దని..సలహాలు, సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా న్యాయసేవలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

ప్యాపిలి: విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన న్యాయసేవలను ఉచితంగా అందిస్తామని డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక సెక్రెడ్ కార్యాలయం ఆవరణలో గురువారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు స్థానిక బస్టాండ్ నుంచి సెక్రెడ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ.. మండల న్యాయసేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవలను ఉచితంగా అందిస్తామని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌ఐ మధుసూదన్ మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులను కించపరిస్తే 6 నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెక్రెడ్ డైరెక్టర్ తిమ్మప్ప, ఏపీఓ రవీంద్ర, దివ్యాంగుల నాయకులు ఎల్లప్ప, సెక్రెడ్ ఫిజియోథెరపిస్టు మారుతిప్రసాద్, సెక్రెడ్ సిబ్బంది శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ చేయాలి

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన గర్భిణీ సైదుమణి మృతిపై విచారణ జరిపించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. గర్భిణీ కాళ్ల వాపులతో ఆస్పత్రికి రాగా వైద్యురాలు సాగరిక పట్టించుకోలేదన్నారు. చివరకు ఒక ట్యాబ్లెట్ ఇచ్చి పంపించారని తెలిపారు. దీంతో ఆమెను నంద్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిందని చెప్పారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

15లోగా రైతులు ప్రీమియం చెల్లించాలి

ప్యాపిలి: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమాకు రైతులు ఈ నెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట బీమా గురించి రైతులకు అవగాహన కల్పించి త్వరితగతిన ప్రీమియం చెల్లించేలా చూడాలని సూచించారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



వీఆర్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలతో సమీక్షించారు. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. మొదటి రోజు అమదాల, 10న పాట్టిపాడు, 11న ఎం. ఉప్పలూరు, 12న చింతకుంట్ల, 13న భీమునిపాడు, 17న గుళ్లదూర్తి, 18న సోదరదిన్నె, 19న వెలగటూరు, 20న వల్లంపాడు, 21న చిన్నకొప్పెర్ల, 24న పెద్దకొప్పెర్ల, 26న రేవనూరు, 27న జోళదరాశి, 28న కోవెలకుంట్ల, 29న లింగాల, జవవరి 2వ తేదీ బిజనవేముల, 3న కలుగొట్ల గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు.

బనగానపల్లె రూరల్: రైతుల భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం యాగంటిపల్లె, మధ్యాహ్నం కటికవానికుంట, 7న యర్రగుడి హుస్సేనాపురం, 10న పసుపల, 11న గులాంఅలియాబాద్ తండా, 12న క్రిష్ణగిరి, చెర్లోకొత్తూరు, 13న నందవరం, టంగుటూరు, 14న గులాంనబీపేట, ఇల్లూరుకొత్తపేట, తమ్మడపల్లె, 17న రామతీర్థం, భానుముక్కల, 18 ఇల్లూరుకొత్తపేట, 19న నందివర్గం, పలుకూరు, 20న బనగానపల్లె, తిమ్మాపురం, 21 కైప సంకలాపురం, 24న బీరవోలు, రాళ్లకొత్తూరు, 26న చెరువుపల్లె, సలామబాద్, 27న జిల్లెళ్ల, బత్తులూరుపాడు, 28న వెంకటాపురం, పండ్లాపురం, 31న వితలాపురం, అప్పలాపురం, జనవరి 2న యనకండ్ల, 3న మిట్టపల్లె, 4న పాతపాడు, జ్వాలాపురం, 7న నిలువు గండ్ల, జంబులదిన్నే, 8న మీరాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

సంజామల: మండలంలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి రెవెన్యూ గ్రామంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ సభ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. ఈ నెల 6న ముదిగేడు, 10న ఆకుమల్ల, 11న కమలపురి, 12న బొందలదిన్నె, 13న హోత్రమాన్‌దిన్నె, 17న సంజామల, 18న కానాల, 19న ఆర్ లింగందిన్నె, 20న నొస్సం, 21న పేరుసోముల, 21న దత్తపురం, 24న గిద్దలూరు, 26న ఆల్వకొండ, 27న మికినేని పల్లె, 28న మంగపల్లె, 31న రామభద్రునిపల్లెలో సదస్సులు జరుగుతాయన్నారు. అలాగే 2025 జనవరి 2వ తేదీ ఎగ్గొని, 3న ముచ్చలపురి, 4న ముక్కమల్ల, 7న వసంతాపురం, 8న నట్లకొట్లకొత్తూరు గ్రామంలో సభలు జరుగుతాయని వెల్లడించారు.

డోన్ రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.నాగమణి తెలిపారు. ఈ నెల 6వ తేదీ ఉంగరానిగుండ్ల, 10న కొచ్చెర్వు, 11న చిన్నమల్కాపురం, 12న జగదుర్తి, 18న డోన్ టౌన్‌లో సదస్సులు జరుగుతాయని వివరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి





సంతాపం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ప్యాపిలి: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాలకు చెందిన ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడిపై దాడి చేసి ఆయన మరణానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు రామాంజనేయులు, రాజేంద్ర డిమాండ్ చేశారు. ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సంతాపం వ్యక్తం చేశారు. పలు పాఠశాలల్లో గుట్కా, గంజాయి సంస్కృతి ఉన్నట్లు తెలుస్తోందన్నారు. దీని కారణంగా విద్యార్థుల్లో నేరప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులను కఠినంగా శిక్షిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

కోవెలకుంట్ల: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట శివప్రసాదరెడ్డి అన్నారు. ఫ్యాప్టో పిలుపు మేరకు గురువారం స్థానిక ఎంఆర్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల దాడిలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం ఎంఈఓ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు గిరీష్, వెంకటేశ్వరరెడ్డి, ఎంఈ సుబ్బారెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రమణ, ప్రసాదు, మనోహర్, ఇమ్రాన్, రమేష్, నరసింహులు, మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సృజన, నాగమణి, రాఘవమ్మ, లక్ష్మిదేవి, మధుమతి పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయులకే రక్షణ లేకుంటే ఎలా?

బేతంచెర్ల: విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకే పాఠశాలలో రక్షణ లేకపోతే ఎలా అని ఎస్టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాయచోటిలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌ను విద్యార్థులు దాడి చేశారన్న వార్త కలిచివేసిందన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే కార్డులు అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

బనగానపల్లె: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ సూచించారు. గురువారం మండలంలోని కైప జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు, బరువు, ఎత్తు కొలతలు తీసి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే కార్డులను పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్న వారు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మర్మక్రియ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



వైద్యం చేస్తున్న అయుర్వేద వైద్యుడు సుబ్రమణ్యం

బనగానపల్లె రూరల్: మర్మక్రియ వైద్యం ఎంతో ప్రాచీనమైందని, దీని ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకోవచ్చని అయుర్వేద వైద్యుడు సుబ్రమణ్యం తెలిపారు. గురువారం స్థానిక చెంచుతోటలోని వీరబ్రహ్మేంద్రస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఉచిత అయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్మకళ వైద్యంతో మానిషిలో ఏ జబ్బు వచ్చే ప్రమాదం ఉందో ముందే తెలుసుకుని తగిన వైద్యం చేసుకోవచ్చన్నారు. ఈ చికిత్స అనుభవం ఉన్న వైద్యుల ద్వారానే తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం సభ్యులు గాథంశెట్టివేణుగోపాల్, గుండా శ్రీనివాసులు, శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, జక్కానాగరాజు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై భారం

- 7లోగా ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయాలి
- ఒక్కో విద్యార్థికి 8 పేజీల కార్డు



హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై విద్యాశాఖ మరో భారం మోపింది. విద్యార్థులకు సంబంధించిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను కొత్తగా ప్రవేశపెట్టారు. డిసెంబర్ 7వ తేదీ నాటికి పూర్తి చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తుండడంతో అదే రోజున కార్డులు తల్లిదండ్రులకు ఇచ్చేలా ప్రణాళిక తయారు చేశారు. ప్రోగ్రెస్ కార్డులో మొత్తం ఎనిమిది పేజీలు ఉంటాయి. వీటిలో పెన్ నంబర్, ఆధార్ నంబర్, అపార్ నంబర్లతో పాటు తల్లిదండ్రుల పూర్తి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు సైతం కార్డులో పొందుపర్చాలి. కొలిమిగుండ్ల మండలంలో 3,968 మంది విద్యార్థులకు కార్డులు అందించేందుకు ఆయా పాఠశాలలకు అందజేశారు. ఇప్పటికే అపార్ కోసం ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు. అది పూర్తికాకమునుపే మళ్లీ ప్రభుత్వం ప్రోగ్రెస్ అప్పగించడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు విద్యార్థికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డు, అసైన్‌మెంట్ తదితర వివరాలకు ఒక్కో దానికి పది మార్కులు నమోదు చేయించారు. మిగిలిన 20 మార్కులు పరీక్షల్లో విద్యార్థి చూపిన ప్రతిభ ఆధారంగా నింపాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్, పాఠశాల రికార్డుల్లో ఇలాగే నమోదు చేస్తూ వచ్చారు. తాజా కార్డుల్లో మాత్రం ఐదేసి మార్కులు కుదించి ప్రతిభకు 35 మార్కులు కేటాయించడంతో ఉపాధ్యాయులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రతి విద్యార్థికి గతంలో కేటాయించిన మార్కుల్లో 50 శాతం కోత విధించి రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలన్నీ నమోదు చేయాలంటే ఒక విద్యార్థికి అరగంట సమయం పడుతుంది. ఒక ఉపాధ్యాయుడితో అయ్యే పని కాకపోవడంతో ఇద్దరు ముగ్గురు కలిసి చేయాల్సి వస్తోంది. ఓవైపు ఎస్‌ఎ-1 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బోధన జరగకుండా బోధనేతర పనులు చేయిస్తుండడంతో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

దానగుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను గురువారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి రూ. 100 చొప్పున పంపిణీ చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, సభ్యులు ఏరాశి మహేశ్వరరెడ్డి, సుబ్బయ్య, ఉపాధి హామీ మేటి రాములమ్మ పాల్గొన్నారు.

కుక్కల బెడదపై ఫిర్యాదు



ఈఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: పట్టణంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని.. వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు గ్రామ పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. రోడ్లపై కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడం వల్ల పాఠశాలలకు వెళ్లాలంటే భయంగా ఉందని పేర్కొన్నారు.

ముగ్గురాయి తరలిస్తున్న టిప్పర్ సీజ్



బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సమీపంలో ఉన్న పొలంలో నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురాయి తవ్వి తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. బేతంచెర్ల నుంచి కడపకు వెళ్తున్న ముగ్గురాయి టిప్పర్‌తో పాటు జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వరావు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఖనిజాలను తవ్వి తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

నేలను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన అధికారి ధనలక్ష్మి

బనగానపల్లె: ప్రస్తుతం ప్రపంచంలోని వ్యవసాయ భూములు 30శాతం సారవంతాన్ని కోల్పోయాయని.. రసాయన వ్యవసాయానికి స్వస్తి చెప్పి సేంద్రీయం వైపు అడుగులు వేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన అధికారి ధనలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె సమీపంలో ఉన్న కేవీకేలో ప్రపంచ మృత్తికా(నేల) దినోత్సవాన్ని నిర్వహించారు. పంటలు సాగుచేసే ప్రతి రైతు నేల తల్లిని సంరక్షించుకోవాలని, ఇందుకు సహజ సిద్ధమైన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడితేనే భవిష్యత్ ఉంటుందని తెలిపారు. వరదలు, గాలి, రసాయన వ్యవసాయం, భూ వినియోగ మార్పులు, అటవీ నిర్మూలన, కాలుష్యం, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాల చేరిక వంటి కారణాలతో నేల ఆరోగ్యం దెబ్బ తింటోందని వివరించారు. రైతులు సేంద్రియ ఎరువులు వినియోగిస్తేనే నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఏటా సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించి వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసి దిగుబడులు పొందాలని కోరారు. అనంతరం రైతులకు భూసార ఫలితాల పత్రాలను అందజేశారు. శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, ఆదినారాయణ, రవిగౌడ్ పాల్గొన్నారు.